జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 30 | అక్టోబర్ | 2025 ◆ పేజీలు : 5

## ఉత్తరప్రదేశ్ లోని కాశీలో భద్రాద్రి రామయ్య కల్యాణం



**భద్రాచలం, అక్టోబర్ 29, ప్రజాజ్యోతి :** ప్రపంచ ప్రఖ్యాతగాంచిన శైవక్షేత్రమైన ఉత్తరప్రదేశ్లోని కాశీ పుణ్యక్షేత్రంలో బుధవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. హిందూ ప్రచారంలో భాగంగా హైదరాబాద్ కు చెందిన శ్రీ పరాశర వైదిక ఆగమశాస్త్ర వేద పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన కల్యాణ ప్రక్రియలో పాల్గొనేందుకు మూడు రోజుల క్రితమే భద్రాచలం నుంచి దేవస్థానం ఈవో కె.దామోదర్రావుతో కూడిన 12 మంది వైదిక పరిపాలన

మిగతా 2 లో...

- ఆధారాలతో ఫోన్లో ఫిర్యాదు చేసిన నిర్లక్ష్యమేనా?
- ఓ సూపర్ మార్కెట్ నిర్వాహకుని ధైర్యం అదేనా?
- కాలం చెల్లిన తినుబండారాలు అమ్మిన స్పందించరా!
- చిన్నారులు, ప్రజల ప్రాణాలు అంటే పట్టింపు ఉండదా!
- గత నెల 27న ఫుడ్ సేఫ్టీ అధికారులు దృష్టికి తీసుకెళ్లిన వైనం
- నేటికీ విచారణకు రాని అధికారులు?
- ఇల్లందుపై ఫుడ్ సేఫ్టీ అధికారులకు అమితమైన ప్రేమ ఎందుకో?
- గత కొన్ని ఏళ్లుగా కొనసాగుతున్న తంతు ఇదేనా!
- జిల్లా కలెక్టర్ సారూ దృష్టి సారించాలని పలువురి వేడుకోలు

# ఫుడ్ సేఫ్టీ అధికారుల... తీరు అంతేనా..?

3 లో..




ఇల్లందుపై ఫుడ్ సేఫ్టీ అధికారుల తీరుపట్ల సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా హోటల్స్, రెస్టారెంట్స్, బేకరీలు, కిరాణా దుకాణాలు, సూపర్ మార్కెట్ లు, సినిమా థియేటర్లలోని కాంటీన్స్ లలో అమ్మే వస్తువులు, తినుబండారాలు నాణ్యతతో ఉన్నాయా.. కాలం చెల్లినవా.. సరైన వాటిని వినియోగిస్తున్నారా అని తనిఖీలు చేయాల్సిన బాధ్యత ఫుడ్ సేఫ్టీ విభాగానికి ఉంటుంది. కానీ ఇల్లందులో సుమారుగా 10 ఏళ్లకు పైగా సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులు సాధారణ తనిఖీలు చేసి ఒక్కటంటే ఒక్క కేసు నమోదు చేయడం కానీ, కనీసం జరిమానా విధించిన దాఖలాలు లేవని ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ ఎవరైనా కాలం చెల్లిన తినుబండారాలు, వస్తువులను అమ్మినట్లు ఆధారాలతో సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులకు బాధితులు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేస్తే, ఈ షాపు మీద ఫిర్యాదు చేస్తున్నారని అడిగి తెలుసుకొని ఆగ మేఘాల మీద సదరు షాపు నిర్వాహకులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చిన వారి వివరాలు చెప్పడం జరుగుతుందని సమాచారం. సాధారణంగా ప్రభుత్వ శాఖ అధికారులకు ఎవరిపైన ఫిర్యాదు చేస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుంది. ఆ అధికారి నిర్వాహకుడికి ఫోన్ చేసి చెప్పడంతో వారికి ధైర్యంతో ఎవరు తమ వద్దకు రారని.. తనిఖీలు చేయరనే ధీమాతో ఇలా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

● ఇల్లందు, ప్రజాజ్యోతి

## భద్రాచలం ఏజెన్సీపై
# మొంథా తుఫాను తీవ్ర ప్రభావం

- భద్రాచలం-రాజమండ్రి ఘాట్రోడ్డు మూసివేత
- తీవ్రంగా నష్టపోతున్న వరి, పత్తి రైతులు
- ఎడతెరిపిలేని వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తం
- జాతీయ రహదారిపై జారిపడిన బొలోరా వాహనం



**భద్రాచలం, అక్టోబర్ 29,ప్రజాజ్యోతి :** భద్రాచలం ఏజెన్సీపై మొంథా తుఫాను తన ప్రతాపాన్ని చూపుతోంది. రెండు రోజులుగా జల్లులతో కూడిన వర్షం పడగా బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం అంతా అస్తవ్యస్తంగా తయారైంది. ముఖ్యంగా భద్రాచలం– రాజమండ్రి ఘాట్ రోడ్డును పూర్తిగా మూసివేసారు. కొండ చరియలు విరిగిపడటంతో ముందస్తుగా ఏపీలోని అల్లూరి జిల్లా అధికారులు వాహనాలను అనుమతించడం లేదు. అలాగే భద్రాచలం పట్టణంలో ముసురుతో కూడిన వర్షం కురుస్తుండటంతో పట్టణంలో

మిగతా 2 లో...

## 51 మంది మావోయిస్టులు లొంగుబాటు

- లొంగిపోయిన మావోయిస్టులలో 9 మంది మహిళలు, 42 మంది పురుషులు
- లొంగిపోయిన మావోయిస్టులపై 66 లక్షలు రివార్డ్




**చర్ల, అక్టోబర్ 29, (ప్రజాజ్యోతి):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ బీజాపూర్ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర నక్సల్ నిర్మూలన విధానం శాంతి, సంభాషణ అభివృద్ధిపై దృష్టిసారించిన నిరంతర ప్రయత్నాల ఫలితంగా బుధవారం 51 మంది మావోయిస్టు కార్యకర్తలు హింస మార్గాన్ని త్యజించి జన జీవన స్రవంతిలోకి తిరిగి రావాలని నిర్ణయించుకున్నారు. "పునరావాసం ద్వారా పునర్జన్మ" పథకం కింద జన జీవన స్రవంతిలోకి చేరిన ఈకార్యకర్తలలో 9మంది మహిళలు 42 మంది పురుష సభ్యులు ఉన్నారు, వీరిపై మొత్తం 66 లక్షల రివార్డు ప్రకటించారు. ఈ 51 మంది కార్యకర్తలలో – పీ ఎల్ జి ఏ బెటాలియన్ నం. కంపెనీ నెం. ఒకటి ,రెండు ,ఐదు ఏ సి ఏం –ఒకరు , ప్లాటూన్ ఏరియా కమిటీ పార్టీ సభ్యులు – ఏడు , ఎల్ ఓ ఎస్ సభ్యులు – మూడు , మిలిషియా ప్లాటూన్ కమాండర్ – ఒకరు ,

మిగతా 2 లో...

# ఉత్తరప్రదేశ్ లోని కాశీలో భద్రాద్రి రామయ్య కల్యాణం



(మొదటి పేజీ తరువాయి...)

సిబ్బంది బయలుదేరి వెళ్లారు. కల్యాణంను భద్రాద్రి దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి ఆధ్వర్యంలో వైదిక బృందం జరిపారు. ఇక్కడ నుంచి తీసుకెళ్లిన శ్రీ సీతారామచంద్రస్వామి ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించారు. అనంతరం కల్యాణ ప్రక్రియలో భాగంగా తొలుత విశ్వక్సేనార్చన చేశారు. అనంతరం యజ్ఞోపవీతధారణ, కంకణధారణ, జీలకర్రబెల్లం, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం, భక్తుల పూజలు జరిపారు. చివరిగా స్వామివారిని సంస్థకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో దామోదర్రావు, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా పాల్గొన్నారు.

# భద్రాచలం ఏజెన్సీపై మొంథా తుఫాను తీవ్ర ప్రభావం





(మొదటి పేజీ తరువాయి...)

వ్యాపార కార్యకలాపాలు మందగించాయి. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు ఇళ్లకే పరిమితమయ్యారు. అలాగే డివిజన్ లోని చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో రైతులు వేసిన పత్తి, వరి పంటలపై తీవ్ర ప్రభావం పడింది. కాయపూసిన పత్తి వర్షాలకు నేలరాలుతోంది. అలాగే వరి పైరు కోత దశకు చేరుకుంటుండటంతో పలు గ్రామాల్లో పంటలు నేలకొరుగుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరింతగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా భద్రాచలంలోని విజయవాడ-జగదల్పూర్ జాతీయ రహదారిపై వర్షం కారణంగా బస్టాండు సమీపంలో రోడ్డుపై జారిపడిపోయింది. దీంతో వాహనంను ట్రాఫిక్ పోలీసులు పొక్లెయిన్ సహాయంతో పక్కకు తీసారు.

# స్ట్రక్చర్ సమావేశంలో...కార్మికుల సమస్యల పై ప్రస్తావన

- పరిష్కరానికి కృషి చేస్తామని హామీ ఇచ్చిన సింగరేణి అధికారులు



**కొత్తగూడెం సింగరేణి, ప్రజా జ్యోతి, అక్టోబర్ 29 :** కొత్తగూడెం సింగరేణి ఏరియా పరిధిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అధికారులతో జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో ఐ ఎన్ టి యూ సీ నాయకులు కోరారు. బుధవారం జీఎం ఆఫీస్ లో జరిగిన స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో పలు అంశాలను ప్రస్తావించారు. సత్తుపల్లి డిస్పెన్సరీ నందు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు మహిళా ఉద్యోగులకు గైనకాలజిస్ట్ మహిళా డాక్టర్ ను ఏర్పాటు చేయాలని, కొత్తగూడెం ఏరియాలో ఉన్న సోలార్ ప్లాంట్ నందు సింగరేణి సంస్థ నుండి సూపర్వైజర్ మరియు సిబ్బంది ని ఏర్పాటు చేయాలని, కొత్తగూడెం ఏరియాలోని ఏరియా వర్క్ షాప్ నందు మ్యాన్ పవర్ , ప్లేడేలు పెంచే ఏర్పాటు చేయాలని , కొత్తగూడెం ఏరియా నుండి సత్తుపల్లి వరకు ఏరియా వర్క్ షాప్ ఆధ్వర్యంలోనే రిపేరింగ్ వర్క్ చేయడం జరుగుతుందనీ ప్రొడక్షన్ అంతరాయం లేకుండా ఉండేందుకు తగిన మ్యాన్ పవర్ మరియు ప్లే డేలు పెంచే విధంగా చూడాలన్నారు. జే.కే ఓసిపి నుండి గతంలో సత్తుపల్లి జేవియర్ ఓపెన్ కాస్ట్ మరియు కిష్టారం ఓపెన్ కాస్ట్, ఇతర ఏరియాలకు డిప్యూటేషన్ మీద పంపిన ఉద్యోగులను మళ్ళీ వీ.కే ఓ.సి.పి, మైన్ కు రిటర్న్ చేసే విధంగా ఏర్పాటు చేయాలని,జి.ఎం ఆఫీస్ నందు క్యాంటీన్ ఏర్పాటు చేసే విధంగా చూడాలి, ఏరియాలో ఉన్న డిపార్ట్మెంట్స్ లకు జి.ఎం ఆఫీస్ నుండి (ఏరియా వర్క్ షాప్) (సివిల్) (వీ.టి.సి), (ఎస్.ఎస్.పి.సి) లకు క్యాంటీన్ ఇచ్చే విధంగా ఏర్పాటు చేయాలని,సత్తుపల్లి జే.వి.ఆర్, ఓపెన్ కాస్ట్ మరియు కిష్టారం ఓపెన్ కాస్ట్ నందు ఆఫ్ లోడింగ్ లో పనిచేయుచున్న ఓవర్ మెన్ లకు నైట్ షిఫ్ట్ చార్జింగ్ అలవెన్స్ ఏర్పాటు చేయాలని, పివికే 5B షాఫ్ట్ నందు సీ.ఎం డిస్టిక్ నందు వర్కింగ్ ప్లేస్ లో వెంటిలేషన్ సమస్య లేకుండా చూడాలని , ఎయిర్ డక్స్ ప్రాబ్లం ఉందనీ, డి వాటరింగ్ కాక ప్రాబ్లం ఏర్పడుతుంది, మ్యాన్ రైడింగ్ ను అన్ని షిఫ్ట్ లలో పూర్తిస్థాయిలో నడపడం లేదు ఎఫ్.ఎస్ 1 బెల్టు, ఎఫ్.ఎస్ 2 బెల్టు వెంబడి వెంటిలేషన్ మెరుగుపరచాలని,కొత్త సర్కులర్ ప్రకారం డిపెండెంట్ ఉద్యోగాలు ఉద్యోగుల చెల్లెలకు ఇచ్చే విధంగా ఏర్పాటు చేయాలని,జే వీఆర్ సిహెచ్ పి నందు ఉన్న సైలో బంకర్ లిఫ్ట్ పనిచేయడంలేదు, దాని ప్లేస్ లో కొత్తది ఏర్పాటు చేయాలని, కొత్తగూడెం ఏరియా లోని పాత జి.ఎం ఆఫీస్ నుండి రుద్రంపూర్ వచ్చే హైవే పక్కన ఉన్న ఫిల్టర్ బెడ్ ఏరియా లో స్ట్రీట్ లైట్ ఏర్పాటు చేయాలని, స్ట్రక్చర్ కమిటీ మీటింగ్లో ముఖ్యమైన అంశాలను పెట్టడం జరిగింది, కొత్తగూడెం ఏరియాలోని సత్తుపల్లి నుండి ప్రొడక్షన్ ఎక్కువ వస్తున్నందున స్పెషల్ ఇన్సెంటివ్ ఇచ్చే విధంగా చూడాలని కోరారు. అదేవిధంగా ఇప్పుడు కూడా ఇన్సెంటివ్ గురించి మాట్లాడడం జరిగింది, అలాగే పాత జీఎం ఆఫీస్ లో ఉన్నటువంటి క్లీనింగ్ సంబంధించిన సమస్యలపై అలాగే పి.వి.కే 5బి షాఫ్ట్ నందు ఉద్యోగుల ప్రమోషన్స్ మరియు టెక్నీషియన్స్ ట్రాన్స్ఫర్స్, ఇతర సమస్య లపై మాట్లాడడం జరిగింది ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ కమిటీ సభ్యులు నాగార్జున, సీతారామరాజు పాల్గొన్నారు.

# 51 మంది మావోయిస్టులు లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి...)

మిలిషియా ప్లాటూన్ సభ్యులు - పద్నాలుగు , ఆర్ పీ సి -జంతన సర్కార్, డీ కె సి ఎం , సి ఎం ఎం - 20యొక్క అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు సభ్యులు ఉన్నారు, వీరు హింసాత్మక ప్రజా వ్యతిరేక భావజాలాన్ని విడిచిపెట్టి శాంతి మార్గాన్ని ఎంచుకున్నారు. 2025సంవత్సరంలో, బీజాపూర్ జిల్లాలో 461 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి చేరారు .భద్రతా దళాల కార్యకలాపాలలో, 138మంది మావోయిస్టులు మరణించారు. 485 మావోయిస్టులు అరెస్టు చేయబడ్డారు. 2024 సంవత్సరం నుండి ఇప్పటివరకు, బీజాపూర్ జిల్లాలో 650 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి చేరారు. భద్రతా దళాల కార్యకలాపాలలో, జిల్లాలో వివిధ ఎన్ కౌంటర్లలో 196 మంది మావోయిస్టులు మరణించారు 986 మంది మావోయిస్టులు అరెస్టు చేయబడ్డారు. ఈ లొంగిపోయిన 51 మంది కార్యకర్తల పునరావాసం సమాజంలో తిరిగి విలీనం కోసం అవసరమైన చట్టపరమైన ప్రక్రియ జరుగుతోంది అని రాష్ట్ర ప్రభుత్వ "పునా మార్గెం - పునరావాసం నుండి పునరుజ్జీవనం" విధానం శాంతి అభివృద్ధికి బలమైన పునాది వేసింది అని పోలీసులు భద్రతా దళాలు, స్థానిక పరిపాలన, సామాజిక సంస్థలు అప్రమత్తమైన పౌరుల సమన్వయ ప్రయత్నాల ద్వారా హింస సంస్కృతి సంభాషణ అభివృద్ధి సంస్కృతిగా రూపాంతరం చెందింది అని అధికారులు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారికి పునరావాస ప్రోత్సాహకంగా 50,000 రూపాయల మొత్తాన్ని అందిస్తుంది అని ఈ పునరావాస ప్రక్రియలో డి ఆర్ జి బస్తర్



ఫైటర్, ఎస్ టి ఎఫ్ , సి ఆర్ పీ ఎఫ్ -85, సి ఆర్ పీ ఎఫ్ -199 కోబ్రా 210, 201 బృందాలు ప్రత్యేక సహకారాన్ని అందించాయి అని అధికారులు తెలియచేసారు .పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ మాట్లాడుతూ "ప్రభుత్వ పునరావాస విధానం మావోయిస్టులను ఆకర్షిస్తోంది అని జన జీవన స్రవంతిలోకి వచ్చిన మావోయిస్టుల కుటుంబాలు కూడా వారు సాధారణ జీవితాన్ని గడపాలని సమాజంతో చేయి కలిపి నడవాలని మావోయిస్టులు తమ తప్పుదారి పట్టించే సిద్ధాంతాలను విడిచిపెట్టి నిర్భయంగా జన జీవన ప్రధాన స్రవంతిలోకి తిరిగి రావాలని యాదవ్ విజ్ఞప్తి చేశారు, తద్వారా ఈ ప్రాంతంలో శాశ్వత శాంతి అభివృద్ధి నెలకొల్పబడుతుంది అని అన్నారు . "పూనా మార్గెమ్ - పునరావాసం నుండి పునరుత్పత్తి" పథకం కింద 51 మంది మావోయిస్టులను జన జీవన స్రవంతిలోకి తిరిగి చేర్చడం బీజాపూర్ జిల్లాలో మారుతున్న సామాజిక వాతావరణం ప్రజల విశ్వాసానికి చిహ్నం అని అన్నారు. .





# చేతికందిన పంట.. చేజారిపోయే

- ఎడతెరిపిలేని వర్షంతో నీట మునిగిన పంటలు
- వందల ఎకరాల్లో నీట మునిగిన వరి, మొక్క జొన్న, పత్తి
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతన్నల వేడుకోలు

**ఇల్లందు, అక్టోబర్ 29, ప్రజాజ్యోతి:** వరుణుడి ఉగ్రరూపంతో రైతన్న ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు నీటమునిగాయి. చేతికొచ్చిన మొక్కజొన్న, వరి, పత్తి పంటలు నీళ్లలో తేలియాడుతున్నాయి.. తుఫాను ప్రభావంతో రైతన్న శ్రమ వృధాగా మారడంతో పాటు రుణాలు తెచ్చి పెట్టిన పెట్టుబడులు సైతం వరదల్లో పంట రూపంలో కొట్టుకుపోయాయి.. ఈ ఏడాది ఆది నుంచి వరుణదేవుడు రైతుల పాలిట శాపంగా మారటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.. చేతికొచ్చిన మొక్కజొన్న పంట కళ్లల్లో రహదారులపై ఆరబోసుకున్న తరుణంలో తుఫాన్ ప్రభావంతో వరదల్లో కొట్టుకుపోయి నీటి తేలుతుంది. వందల క్వింటాళ్ల మొక్కజొన్న కళ్ళముందే నీళ్ల పాలు అవ్వడంతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. ఇక చేతి కొచ్చిన వరి వర్షం ఈదురు గాలులతో నేలమ్మ తల్లిని ముద్దాడుతుంది. మరికొన్ని ప్రాంతాల్లో నీళ్లలో మునిగిపోయింది. పత్తి పంటలు వర్షంతో తీవ్రంగా దెబ్బతినడంతో ప్రకృతిని నేలమ్మ తల్లిని నమ్ముకున్న రైతన్నకు చివరకు వరుణదేవుడు కంటతడి పెట్టించాడని అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. వర్షాభావంతో చెమటోడ్చి న రైతన్నకు ఈ ఏడాది నిరాశే ఎదురైందని చెప్పొచ్చు. తుఫాన్ ప్రభావంతో మరో రెండురోజులపాటు వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన తమకు ప్రభుత్వం ఆదుకోవాలని లేనిపక్షంలో ఆత్మహత్యలే శరణ్యమని పలువురు రైతులు రోదిస్తూ ప్రభుత్వాన్ని వ్యవసాయ అధికారులను చేతులెత్తి మొక్కుతున్నారు.



- ఆధారాలతో ఫోన్లో ఫిర్యాదు చేసిన నిర్లక్ష్యమేనా?
- ఓ సూపర్ మార్కెట్ నిర్వాహకుని ధైర్యం అదేనా?
- కాలం చెల్లిన తినుబండారాలు అమ్మిన స్పందించరా!
- చిన్నారులు, ప్రజల ప్రాణాలు అంటే పట్టింపు ఉండదా!
- గత నెల 27న ఫుడ్ సేఫ్టీ అధికారులు దృష్టికి తీసుకెళ్లిన వైనం
- నేటికీ విచారణకు రాని అధికారులు?
- ఇల్లందుపై ఫుడ్ సేఫ్టీ అధికారులకు అమితమైన ప్రేమ ఎందుకో?
- గత కొన్ని ఏళ్లుగా కొనసాగుతున్న తంతు ఇదేనా!
- జిల్లా కలెక్టర్ సారూ దృష్టి సారించాలని పలువురి వేడుకోలు



# ఫుడ్ సేఫ్టీ అధికారుల... తీరు అంతేనా..?




ఇల్లందుపై ఫుడ్ సేఫ్టీ అధికారుల తీరుపట్ల సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా హోటల్స్, రెస్టారెంట్స్, బేకరీలు, కిరాణా దుకాణాలు, సూపర్ మార్కెట్ లు, సినిమా థియేటర్లలోని కాంటీన్స్ లలో అమ్మే వస్తువులు, తినుబండారాలు నాణ్యతతో ఉన్నాయా.. కాలం చెల్లినవా.. సరైన వాటిని వినియోగిస్తున్నారా అని తనిఖీలు చేయాల్సిన బాధ్యత ఫుడ్ సేఫ్టీ విభాగానికి ఉంటుంది. కానీ ఇల్లందులో సుమారుగా 10 ఏళ్లకు పైగా సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులు సాధారణ తనిఖీలు చేసి ఒక్కటంటే ఒక్క కేసు నమోదు చేయడం కానీ, కనీసం జరిమానా విధించిన దాఖలాలు లేవని ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ ఎవరైనా కాలం చెల్లిన తినుబండారాలు, వస్తువులను అమ్మినట్లు ఆధారాలతో సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులకు బాధితులు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేస్తే, ఈ షాపు మీద ఫిర్యాదు చేస్తున్నారని అడిగి తెలుసుకొని ఆగ మేఘాల మీద సదరు షాపు నిర్వాహకులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చిన వారి వివరాలు చెప్పడం జరుగుతుందని సమాచారం. సాధారణంగా ప్రభుత్వ శాఖ అధికారులకు ఎవరిపైన ఫిర్యాదు చేస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుంది. ఆ అధికారి నిర్వాహకుడికి ఫోన్ చేసి చెప్పడంతో వారికి ధైర్యంతో ఎవరు తమ వద్దకు రారని.. తనిఖీలు చేయారనే ధీమాతో ఇలా వ్యవరిస్తున్నట్లు సమాచారం.

**● ఇల్లందు, ప్రజాజ్యోతి**



వందలసార్లు అధికారులకు ఫోన్ చేసినా గాని ఏదో మొక్కుబడిగా వస్తామని విచారణ చేస్తామని చర్యలు తీసుకుంటామని మాటలు చెప్పడం తప్ప ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదని ఆ శాఖ అధికారులపై అపవాదు లేకపోలేదు.. అన్ని ఆధారాలతో సహా ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేసినా గాని విచారణకు రాకపోవడం పైగా రేపు... బాబు అని కాలయాపన చేయడం వల్లనే సదరు సూపర్ మార్కెట్ అంత ధైర్యం అని స్పష్టమవుతుందని పలువురు పేర్కొంటున్నారు. గతంలో ప్రధాన రోడ్డు వెంబడి ఆర్సీఎం చర్చి సమీపంలో గల సూపర్ మార్కెట్లో పలుమార్లు కాలం చెల్లిన తిరుబండారాలు, వస్తువులు అమ్మినప్పటికీ అధికారులకు ఫిర్యాదు చేసిన విచారణ చేసి శాఖ పరమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఆ సూపర్ మార్కెట్లో తినుబండారాలు వస్తువులు కాలం చెల్లినవే విక్రయాలు జరుపుతున్నప్పటికీ వాటిని తిని చిన్నారులు ప్రజలకు ఏమైనా అనారోగ్య సమస్యలు వచ్చినా కానీ నిర్వాహకులు, సాముహిత ఫుడ్స్ అధికారులు ఇలా నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తారా అని ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇదే కోవాలో గత నెల 27న ప్రధాన రోడ్డు వెంబడి ఆర్సీఎం చర్చి వద్ద గల ఓ సూపర్ మార్కెట్లో కాలం చెల్లిన తిరుబండారాలను విక్రయించినట్లు పూర్తి ఆధారాలతో సంబంధిత ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారికి వాట్సఅప్ చేసి బాధితుడు ఫోన్లో విషయం చెప్పి వారిని దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. సదరు అధికారి గత నెల 29, 30 తేదీలలో విచారణకు వస్తానని స్థిరపడంతే దీలలో విచారణకు వస్తానని తెలపడం జరిగిందని బాధితుడు పేర్కొన్నారు. పైగా ఆ సూపర్ మార్కెట్ నిర్వాహకుడు మాత్రం కాలం చెల్లిని వస్తువులు తినుబండారులను విక్రయించడం తమ తప్పు కాదని దానిని ఎంతలా పట్టించుకోవాల్సిన అవసరం లేదని, అసలు విచారణకు రాకుండానే ఆ సూపర్ మార్కెట్ లో ఒకే ఒక తినుబండారం ఉందని, దానిని మాత్రమే అమ్మినట్లు అధికారి పేర్కొనడం గమనార్హం. అంతేకాకుండా కాలం చెల్లిన తినుబండారాలను కొనుగోలు చూసినవారు కావాలనే ఇంతలా రాద్ధాంతం చేస్తున్నారని బహిరంగంగా పేర్కొన్నట్లు ప్రచారం జరుగుతుంది.



## అధికారులు ప్రజల వైపా.. నిర్వాహకులకు మద్దతా

కాలం చెల్లిన తినుబండారాలు, ఇతరత్రా వస్తువులను అమ్ముతున్న సూపర్ మార్కెట్ నిర్వాహకులకు ఫుడ్ సెఫ్టీ అధికారులకు మద్దతు తెలుపుతారా.. అలాంటి వస్తువులను కొనుగోలు చేసిన ప్రజల వైపు ఉంటారా అనేది స్పష్టత రావాల్సి ఉంది. గత కొన్ని ఏళ్ల నుండి ఇల్లందులో హోటల్స్, రెస్టారెంట్స్, దుకాణాలు, సూపర్ మార్కెట్స్, సినిమా థియేటర్ లోని క్యాంటీన్లను ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కాలం చెల్లిన వస్తువులు తినుబండారాలను గుర్తించి నిర్వాహకులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదనే బహిరంగ ఆరోపణలు ఉన్నాయి. ఏదో మొక్కుబడిగా ముందస్తు సమాచారం ఇచ్చి ఇల్లందుకు వచ్చి రెండు లేదా మూడు బేకరీలు, దుకాణాలను తనిఖీ చేసినట్లు వచ్చి పోవడం వెనుక ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

## అధికారులకు ఫిర్యాదు చేస్తే వెంటనే ఫోన్

ఇల్లందులోని హోటల్స్, రెస్టారెంట్స్, దుకాణాలు, సూపర్ మార్కెట్స్, సినిమా థియేటర్ లోని క్యాంటీన్లలో సంబంధించి కాలం చెల్లిన తినుబండారాలు, వస్తువులను అమ్మినట్లు పూర్తి ఆధారాలతో ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే, ఏ షాప్ అని ఫోన్ చేసిన వారిని అడిగి తెలుసుకుని వెంటనే సదరు నిర్వహకులకు ఫోన్ చేసి పలాన వ్యక్తి ఫోన్ చేసి మీపై ఫిర్యాదు చేసాడని సమాచారం చెప్పడం జరుగుతుందని తెలుస్తుంది. ఇలా వారికి అధికారి ఫోన్ చేస్తే ఫిర్యాదు చేసిన వారికి ఏమీ జరుగుతుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఏమైనా లోపాయికారి ఒప్పందం ఉందా?

ఫుడ్ సేఫ్టీ అధికారులకు హోటల్స్, రెస్టారెంట్స్, దుకాణాలు, సూపర్ మార్కెట్స్, సినిమా థియేటర్ లోని క్యాంటీన్ల నిర్వహకులకు ఏమైనా రూపాయి కారి ఒప్పందాలు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నాణ్యత ప్రమాణాలు పాటించని, కాలం చెల్లిన తినుబండారాలు, వస్తువులను అమ్మితే ఆ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే విచారణ చేసి చర్యలు తీసుకోవాల్సింది పోయి నిర్వాహకులకు వత్తాసు పలకడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అదే కాక ఆ శాఖ అధికారులకు నెలల మామూలు మృదుతున్నాయా అనే ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ గారు స్పందించి ఇల్లందులో గత కొన్ని ఏళ్లుగా హోటల్స్, రెస్టారెంట్స్, దుకాణాలు, సూపర్ మార్కెట్స్, సినిమా థియేటర్ లోని క్యాంటీన్లలలో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకొవాలని, ఎలా ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీలు చేసి సదరు నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రజలు, చిన్నారుల ప్రాణాలను కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు.



# ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ రాష్ట్రకార్యదర్శిగా తోటమల్ల సురేష్ బాబు నియామకం



**భద్రాచలం టౌన్, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి )**ప్రోగ్రెసివ్ టీచర్స్ రికగ్నైజ్డ్ యూనియన్ తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి గా భద్రాచలం పట్టణానికి చెందిన తోటమల్ల సురేష్ బాబు ను నియమించారు .ఈ మేరకు పి ఆర్ టీ యు రాష్ట్ర అధ్యక్షులు పుల్గమ్ దామోదర్ రెడ్డి ,ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ బుధవారం నియామకపు ఉత్తర్వులు విడుదల చేసారు .సురేష్ బాబు 1998 లో ఉపాధ్యాయుడిగా నియామకమైన దగ్గరనుండి గత 27 సంవత్సరాలుగా పి ఆర్ టీ యు సంఘం లో క్రియాశీల కార్యకర్తగా కొనసాగుతున్నారని,ప్రస్తు తం సురేష్ బాబు చర్ల మండలం తేగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో స్కూలు అసిస్టెంటు ఫిజికల్ సైన్స్ టీచర్ గా పని చేస్తున్నారు అని అన్నారు..ఈ సంధర్భంగా సురేష్ బాబు మాట్లడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు అప్పచెప్పడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు .తనను రాష్ర కార్యదర్శిగా నియమించిన ఎంమ్మెల్సీ శ్రీ పాల్ రెడ్డి ,రాష్ట్ర అధ్యక్ష ప్రధానకార్యదర్శిలు పుల్గమ్ దామోదర్ రెడ్డి, సుంకరి బిక్షంగౌడ్ గార్లకు కృతజ్ఞతలు తెలిపారు .రాష్ట్ర కార్యదర్శిగా సురేష్ బాబును నియమించటం పట్ల రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ధనికొండ శ్రీనివాస రావు ,కె.వి .రమణ ,రాష్ట్ర నాయకులు బత్తుల శ్రీను ,సి హెచ్ .వేణు జిల్లా అధ్యక్ష,కార్యదర్శి లు పి .నరసయ్య ,ప్రభాకర్ ,చెర్ల మండల అధ్యక్ష కార్యదర్శి లు రవికుమార్ ,వీరభద్రం భద్రాచలం మండల అధ్యక్ష ,కార్యదర్శి లు బి .కృష్ణటి .రామ కృష్ణలు హర్షం వ్యక్తం చేశారు .

## మొంథా తుఫాన్ తో... రైతు కంట కన్నీరు

- రోలపాడు వద్ద నిలిచిపోయిన రాకపోకలు
- నేలకొరిగిన వరి
- టేకులపల్లి మండలంలో వర్షంతో రైతన్న విలవిల





**టేకులపల్లి,అక్టోబర్29,ప్రజాజ్యోతి:**అన్నం పెట్టే రైతన్న మొంథా తుఫాన్ దెబ్బకు కన్నీరు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది.ఇప్పటికే భారీ వర్షాలు నేపథ్యంలో పంట దిగుబడి అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ చేతికి అందిన కొద్ది మాత్రం పంట సైతం తుఫాను ప్రభావంతో కళ్ళల్లో ఆరబోసిన మొక్కజొన్న నీట మునిగింది. కల్లాలో, రహదారులపై ఆరబోసిన వందల క్వింటాళ్ల మొక్కజొన్న వర్షానికి తడిసి ముద్దవ్వడంతోపాటు, నీటిలో తేలి ఆడుతుండడంతో రైతన్నలు తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికే చేతికొచ్చిన కొద్దిపాటి దిగుబడితో ఆందోళన చెందుతున్న రైతన్నలకు తుఫాను దెబ్బతో పూర్తిగా నష్టపోయే అవకాశం లేకపోలేదు. మండలంలోని పాతర్ల గడ్డలో ఆరబోసిన మొక్కజొన్న నీటిలో తేలుతుంది,వరి పొలాలు సైతం తుఫాను ఈదురు గాలుల నేపథ్యంలో నేలకొరిగాయి. పంట కొచ్చిన తరుణంలో తుఫాన్ ఎఫెక్ట్ వల్ల వరి రైతులు విలవిల్లాడుతున్నారు. పంట నేల కొరవడం నీటి ముడగడంతో ఆరుగాలం కష్టించిన కష్టానికి పెట్టుబడి సైతం ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు, ప్రభుత్వం, ఎమ్మెల్యే, జిల్లా మంత్రులు తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. మండలం లోని తూర్పు గూడెం సమీపంలో భారీ వర్షానికి ప్రవహిస్తున్న రాలవాగు, రోలపాడు వద్ద రాకపోకలను బంద్ చేశారు.

# యువ నాయకుల సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే






- గాడి విజయ్, సత్య వాణి పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న డాక్టర్ తెల్లం వెంకట్రావు

**భద్రాచలం, అక్టోబర్ 29,ప్రజాజ్యోతి :** భద్రాచలం అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గాడి విజయ్, మహిళా మండల నాయకురాలు సత్యవాణి ల పుట్టినరోజు వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలో ఎమ్మెల్యే ప్రత్యేక అతిథిగా హాజరై కేక్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువత పార్టీలకు బలమని, యువ నాయకులు సామాజిక సేవలో ముందుండాలని ఆకాంక్షించారు. రక్తదానం, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో గాడి విజయ్ చురుకుగా పాల్గొంటూ సమాజానికి తోడ్పాటును అందిస్తున్నాడని ఆయన ప్రశ ంసించారు. కార ్యక్రమ ంలో మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువ నాయకులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## ఖాసీంకు అండగా నిలిచిన మిత్రులు,సహృదయ ఫౌండేషన్



**బూర్గంపహాడ్,అక్టోబర్ 29,(ప్రజా జ్యోతి):**బూర్గంపహాడ్ మండలం అంజనాపురం గ్రామంకు చెందిన ఎస్.కె ఖాసీం కి అనారోగ్య కారణంతో ఖమ్మం కిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబానికి వైద్య ఖర్చులు భారమై బుధవారం భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న అంజనాపురం గ్రామానికి చెందిన ఖాసీం మిత్రులు రూ.12000, సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సునీత రూ.6500 మొత్తం 18500 రూపాయలను భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి బాధితులకి అందజేసి ఖాసీంను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో సహృదయ ఫౌండేషన్ అధ్యక్షురాలు తుల్లుబెళ్ళ సునీత,సంపత్,తేజవత్ గాంధీ, బాణావత్ అశోక్ కుమార్, భూక్యా ఆనందరావు, భూక్యా హేంలాల్,బాణావత్ పంతులు,బోడా అశోక్,బోడా దిలీప్,తేజవత్ భాస్కరరావు ఉన్నారు.

## సొసైటీ ఫార్మాలిటీ నూతన కమిటీ ఎన్నిక

**చర్ల, అక్టోబర్ 29(ప్రజా జ్యోతి ) :**చర్ల మండలంలో బుధవారం అసైన్మెంట్ రైతుల సమావేశం జరిగింది . రైతు సంఘం చర్ల మండల కార్యదర్శి మచ్చ రామారావు మాట్లాడుతూ 1964లో దళితులకు 116 ఎకరాల భూమిని 32 మంది రైతులకు ఇచ్చారని తెలిపారు. ఆనాటి నుంచి ఇప్పటివరకు పట్టాల కో సం ఎన్నిసార్లు తిరిగిన అధికారులు ఇవ్వలేదని తెలిపారు. ఇప్పుడున్న ప్రభు త్వం అసైన్మెంట్ భూములకు పట్టాలిస్తామని కళ్యాణి భూభారతిలో దరఖాస్తులు పె ట్టుకోమని చెప్పిందని దరఖాస్తులు పెట్టిన అధికారులు తీసుకోవడం లేదని అ న్నారు. ఈ సందర్భంగా రైతులందరూ కలిసి సొసైటీ ఫార్మాలిటీ కమిటీని ఏర్పా టు చేసుకున్నారని తెలిపారు. ఈ నూతన కమిటీకి అధ్యక్షుడిగా దొడ్డ ప్రభుదాస్, కార్యదర్శిగా మచ్చ రామారావు, సహాయ అధ్యక్షులుగా కనుకు వీరభద్రం, సహా య కార్యదర్శిగా చింతల చంద్రం, కమిటీ మెంబర్లుగా ప్రభుదాస్ కనుకు వెంకటేశ్వర్లు, దొడ్డ వెంకటేశ్వర్లు, ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ పట్టాలిచ్చే వరకు దశల వారి పోరాటాలు చేస్తామని తెలిపారు.




## 14వ వేతన ఒప్పందం కాంట్రాక్టు కార్మిక జేఏసీ తోనే జరపాలి

- 13వ వేతన ఎల్ టి ఏ పెండింగ్ సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలి
- జాయింట్ లేబర్ కమిషనర్,డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారులకు వినతి



**బూర్గంపహాడ్,అక్టోబర్ 29,(ప్రజా జ్యోతి) :**సారపాక ఐటిసి పిఎస్ పిడి లో త్వరలో జరగబోయే 14వ వేతన ఒప్పందం కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ తోనే జరిపించాలని వరంగల్ జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి రాజేంద్రప్రసాద్, ఖమ్మం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి విజయ్ భాస్కర్ రెడ్డి లకు బుధవారం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కాంట్రాక్టు కార్మికుల జేఏసీ అందించారు. 13వ వేతన ఒప్పందం ఎల్ టిఏ పెండింగ్ కాపీని పెండింగ్ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. గత 13వ వేతన ఒప్పందాలలో తమకు అవసరమైన వేతనాలు తమ సమస్యలపై పూర్తిస్థాయిలో పట్టించుకోలేదని తెలియజేశారు. తమకు రావలసిన న్యాయమైన తమ సంక్షేమం వేతనాలు ఆశించిన స్థాయిలో ఇవ్వలేదని వివరించారు. ప్రస్తుత గుర్తింపు సంఘానికి తమకు ఎటువంటి సంబంధం లేదని 13వ వేతన ఎల్ టి ఏ కాపీ గుర్తింపు సంఘాన్ని అడిగిన యాజమాన్యాన్ని అడిగిన తమకు ఇవ్వలేదని 13వ వేతన ఒప్పందం సమస్యలే పెండింగ్లో ఉన్నాయని వాటిని పరిష్కరించలేదని తాము జేఏసీగా ఏర్పడి తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసమే వినతి అందిస్తున్నామని పేర్కొన్నారు. సుమారు 2000 మంది కాంట్రాక్ట్ కార్మికుల సంతకాల సేకరణతో వినతిపత్రం అందించామని 14వ వేతన ఒప్పందం తమ సమక్షంలో జరగాలని వినతి పత్రం ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికుల సంఘం జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో కన్వీనర్ సానికొమ్ము రామచంద్రారెడ్డి, సభ్యులు వీరన్న ,సతీష్ ,వెంకట్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కోలాగారం కాటారుసుం వేలంపాట

**టేకులపల్లి,అక్టోబర్29,ప్రజాజ్యోతి:**మండల కేంద్రంలోని టేకులపల్లి గ్రామ పంచాయతీ లో గురువారం 30వ తేదీ ఉదయం 10గంటలకు కోలాగారం కాటారుసుం వేలంపాట ఏర్పాటు చేయనున్నట్లు టేకులపలి పంచాయతీ కార్యదర్శి ఉప్పు దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటదారులు, టేకుల పల్లిపంచాయతీ ప్రజలు పాల్గొనగలరని ఆమె తెలపారు.

# పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి





**జూలూరుపాడు అక్టోబర్ 29ప్రజా జ్యోతి** జూలూరుపాడు మండల వ్యాప్తంగా గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని వైరా నియోజక వర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు నీట మునగడంతో రైతులకు తీవ్ర నష్టం కలిగిందన్నారు. చేతికొచ్చిన పంటలు రైతుల కళ్ళ ముందే వర్షాలకు నీటిలో మునగడంతో వరి, మిర్చి, మొక్కజొన్న, పాటు పత్తి కాయల సైతం నల్లగా మారాయని, నష్టపోయిన పంటల వివరాలను అంచనా వేసి ఎకరానికి రూ.30వేల నుంచి 50 వేల చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే అప్పుల బాధలతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడే అవకాశం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతన్నలకు అండగా ఉంటూ పంట నష్టపరిహారం చెల్లించే వరకు రైతుల వెంటే ఉంటామన్నారు. పంట నష్టపోయిన పంటలను వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందించాలని ఆయన కోరారు.

# నకిలీ మరణ ధృవపత్రంతో రూ.10 లక్షల ఎల్ ఐసీ మోసం

- నలుగురు అరెస్ట్ – కోర్టుకు రిమాండ్




**భద్రాచలం, అక్టోబర్ 29,ప్రజాజ్యోతి :**నకిలీ మరణ ధృవపత్రం సృష్టించి ఎల్ ఐసీ సంస్థను మోసపూరితంగా రూ.10 లక్షలు దోచుకున్న కేసులో నలుగురు వ్యక్తులను భద్రాచలం పోలీసులు అరెస్టు చేశారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్ కు తరలించారు.బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన భూక్యా శ్రీరాములు పేరుతో ఉన్న ఎల్ ఐసీ పాలసీపై మరణం నమోదు అయినట్లు పత్రాలు సృష్టించి, ఆ క్లెయిమ్ పై రూ. 10 లక్షలు పొందేందుకు పథకం రచించారు. ఈ మేరకు శ్రీరాములు, అతని భార్య భూక్యా రాధ, భూక్యా లక్ష్మణ్, నాగినేనిప్రోలు గ్రామానికి చెందిన ఎల్ ఐసీ ఏజెంట్ షేక్ యాకూబ్ పాషా కలిసి కుట్ర పన్నినట్లు విచారణలో వెల్లడైంది.ఎల్ ఐసీ నుంచి అందిన నగదును వారంతా తమ తమ వాటాలుగా పంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయం గుర్తించిన ఎల్ ఐసీ అధికారులు భద్రాచలం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యవహారంలో ఇంకా మరికొందరి ప్రమేయం ఉన్నట్టు తెలిసి, విచారణ కొనసాగుతోందని సీఐ నాగరాజు తెలిపారు.

# ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

**ఇల్లందు, అక్టోబర్ 29, ప్రజాజ్యోతి:** హైదరాబాద్ హెల్ప్ ఎవర్ ట్రీ ఫౌండేషన్ అధ్వర్యంలో ఉచిత హాస్టల్ వసతితో కూడిన ఫుడ్ అండ్ బేవరేజెస్ కోర్సులో శిక్షణ ఇచ్చి ప్రముఖ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 5వరకు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రూ. 15వేల నుంచి రూ. 22 వేల వరకు జీతం ఇవ్వనున్నట్లు తెలిపారు. 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించబడునన్నారు. 10వ తరగతి పాసై, 18 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉండాలని ఆసక్తి గల వారు +91 9849195786 నెంబర్ లో సంప్రదించాలని కోరారు.

# వర్షాలతో బ్రిడ్జిలు పైనుంచి నీరు

- పలు గ్రామాలకు రాకపోకల్లో అంతరాయం
- పర్యవేక్షిస్తున్న మండల అధికారులు



**జూలూరుపాడు అక్టోబర్ 29 ప్రజాజ్యోతి**

జూలూరుపాడు మండల వ్యాప్తంగా వర్షాలు అంతలా కుతలం చేశాయి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా కురవడంతో వాగులు వంకలు పొంగిపొర్లుయి వర్షాలతో గ్రామాల మధ్య వాగులపై ఉన్న బ్రిడ్జిలు పైనుంచి నీరు వెళ్లడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. జూలూరుపాడు పాపకొల్లు మధ్యలో ఉన్న తుమ్మల వాగు ఉద్రృతంగా బ్రిడ్జిపై నుంచి ప్రవహించటంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం కలిగింది బేతాళపాడు పడమటి నరసాపురం మధ్యలో ఉన్న పెద్దవాగు సైతం పొంగిపొర్లడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది అనంతరం కాకర్ల వాగొడుతండ మధ్యలో ఉన్న బ్రిడ్జిపై నుంచి కూడా నీరు ఉదృతంగా ప్రవహించింది విషయం తెలుసుకున్న మండల అభివృద్ధి అధికారి పూరేటి అజయ్ బ్రిడ్జలవద్దకు వెళ్లి పరిశీలించారు వరద ఉధృతంగా ఉండటంతో వాహనాలను అడ్డుపెట్టి వాహనదారులను నిలిపివేశారు కొన్నిదారులు ద్వారా వాహనాలను మళ్లించారు. గురవాగు తండ వద్ద వరదఉధృతికి రహదారి కొట్టుకుపోయింది. అయితే మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలను కలిపే చప్టాలు లో లెవెల్ లో ఉండడం నిర్మాణం కూడా చేసి చాలా సంవత్సరాలు కావడంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు చెబుతున్నారు అయితే ప్రస్తుతం ఈ దారుల మధ్య నూతన బ్రిడ్జిలను ఏర్పాటు చేస్తే రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని చెబుతున్నారు.



# 21మంది మావోయిస్టులు లొంగబాటు

- లొంగిపోయిన మావోయిస్టులకు రెడ్ కార్పెట్ తో స్వాగతం




**చర్ల, అక్టోబర్ 29(ప్రజా జ్యోతి ) :**తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ కాంకేర్ జిల్లాలో చురుకుగా ఉన్న ఇరవై ఒక్క నక్సలైట్లు బుధవారం పోలీసుల ముందు లొంగిపోయి జనజీవన స్రవంతిలోకి తిరిగి రావాలని నిర్ణయించుకున్నారు. జంగిల్‌వార్ కళాశాల క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో నక్సలైట్లందరికీ రెడ్ కార్పెట్‌తో అధికారులు స్వాగతం పలికారు. బస్తర్ రేంజ్ ఐజీ పి. సుందర్‌రాజ్ లొంగిపోయిన నక్సలైట్లకు రాజ్యాంగ ప్రతిని అందజేసి తిరిగి జనజీవన స్రవంతిలోకి స్వాగతం పలికారు. నక్సలిజాన్ని నిర్మూలించేందుకు జరుగుతున్న ప్రచారంలో భాగంగా పోలీసులు ఇటీవల తమ వ్యూహాన్ని సవరించారు. ఎన్‌కౌంటర్‌ల కంటే లొంగిపోవడమే ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంటోంది. నక్సలైట్లు లొంగిపోయి జనజీవన స్రవంతిలోకి తిరిగి వస్తే వారిని స్వాగతిస్తామని లేకుంటే చర్య తీసుకోవడానికి దళం సిద్ధంగా ఉందని పోలీసులు స్పష్టంగా తెలియజేశారు. ఈ నెలలో జగదల్పూర్‌లో 208 మంది నక్సలైట్లు 109 ఆయుధాలతో లొంగిపోయారు. కాంకేర్ జిల్లాలోని రెండు ఏరియా కమిటీలకు చెందిన 21 మంది నక్సలైట్లు 18 ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. నక్సల్ సంస్థ పొలిట్‌బ్యూరో సెంట్రల్ కమిటీలో 45 మంది సభ్యులు ఉండేవారని అది ఇప్పుడు 6 నుండి 7కి మాత్రమే తగ్గిందని ఐజి పి. సుందర్‌రాజ్ అన్నారు. దక్షిణ బస్తర్ అడవుల్లో దాక్కున్న నక్సలైట్లు లొంగిపోయి శాంతి మార్గాన్ని అవలంబించాలని లేకుంటే భద్రతా దళాల చర్యకు సిద్ధంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పేకాట స్థావరంపై పోలీసులు దాడి

- ఆరుగురు అరెస్ట్

**ములకలపల్లి, అక్టోబర్ 29, ప్రజాజ్యోతి:** మండలం లోని మాదారం గ్రామంలో పేకాట స్థావరంపై బుధవారం ములకలపల్లి పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోని కేసునమోదు చేశారు. ములకలపల్లి ఎస్సై మధుప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మాధారం గ్రామంలో పేకాట స్థావరం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేయడం జరిగిందని ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు లను అదుపులోకి తీసుకొని వారి వద్దనుంచి రూ 5,150 నగదు, ఒక సెల్ ఫోన్ ను స్వాధీనపర్చుకోవడం జరిగిందని సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రజలు పేకాట, జూదం వంటి చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఇటువంటి కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మండలంలో ఎవరైనా జూదం పేకాట స్థావరాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అయ్యప్ప భక్తి మార్గం సేవా భాగ్యం

- తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు



**భద్రాచలం ,అక్టోబర్ 29,ప్రజాజ్యోతి :**భద్రాచలం పట్టణంలోని శ్రీ అయ్యప్ప దేవాలయంలో ప్రతి బుధవారం జరుగుతున్న నిత్య అన్నదానం కార్యక్రమంలో భద్రాచలం తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకున్న ఆయన భక్తులకు స్వయంగా అన్నం వడ్డించి సేవా కార్యక్రమంలో భాగమయ్యారు.అన్నదానం మహత్యాన్ని వివరించిన తహసీల్దార్ అన్నదానం అన్నది దైవ సేవల్లో శ్రేష్ఠమైనది అన్నదాత సుఖీభవ అనే దైవ సందేశాన్ని ప్రపంచానికి తెలియజేస్తూ అనేక మందికి ఆకలి తీర్చటం ద్వారా పుణ్యఫలితాన్ని అందిస్తుంది అని పేర్కొన్నారు. భక్తి వినయం నియమాచరణలతో సాగేదే అయ్యప్ప మార్గమని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.మండల దీక్ష, అయ్యప్ప స్వామి భక్తి మార్గం సద్గుణాల పెంపు, సహనం,సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన గుర్తుచేశారు. శబరిమల యాత్ర మనోనిగ్రహం, క్రమశిక్షణ, భక్తి అనే మూడు విలువల సమ్మేళనం అని వివరించారు.ఈ కార్యక్రమంలో అర్చకులు వేద మంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరహర స్వామీ శబరిమలయ్య నినాదాలతో దేవాలయ పరిసరాలు మ్రోగిపోయాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శనానికి విచ్చేశారు.ఈ సేవా కార్యక్రమం నిర్వహణలో దేవాలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప మాల దీక్ష స్వాములు పాల్గొన్నారు .భక్తులు కీలక పాత్ర పోషించారు . ప్రతి వారమూ భక్తుల కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు